

గోదావరికి హారతి

కార్తీక మాసం పంచరత్నాల్లో భాగంగా కాళేశ్వరంలోని గోదావరికి కాళేశ్వరాలయ అర్చకులు శనివారం పంచహారతి ఇచ్చారు.

- 6లో▸



ఇంటర్ యూనివర్సిటీకి కేయూ జట్లు

సౌత్ వెస్ట్‌జోన్ ఇంటర్ యూనివర్సిటీ రెజ్లింగ్ టోర్నమెంట్‌కు కేయూ జట్లను ఎంపిక చేసినట్లు ఆచార్య శ్రీనివాస్‌రావు తెలిపారు.

- 6లో▸

గరిష్టం/కనిష్టం
30⁰ /21⁰

వాతావరణం

జిల్లాలో ఉదయం నుంచి ఆకాశం మేఘావృతమై ఉంటుంది. సాయంత్రం ఆహ్లాదంగా ఉంటుంది.రాత్రి వేళ మంచు కురుస్తుంది.

న్యూస్‌రీల్

అయ్యప్ప ఆలయంలో ప్రత్యేక పూజలు



నర్సంపేట: శ్రీధర్మశాస్తా అయ్యప్పస్వామి ఆలయంలో 23వ మండల పూజలు శనివారం పదో రోజుకు చేరాయి. ఆలయ అర్చకులు దేవిష్‌మిశ్రా, తివారి సాహు అయ్యప్పస్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా అజ్మీరా కార్తీక్–స్పందన, గట్ల సాయిరాం–నవ్యశ్రీ,, కుప్ప సంతోష్‌కుమార్–శ్రీలేఖ, గట్టు రమేష్–ధనలక్ష్మి, కొణతం శ్రీనివాస్‌రెడ్డి–అనిత అయ్యప్ప స్వాములకు అన్నదానం చేశారు. అనంతరం ఆలయ చైర్మన్ మాధవశంకర్ మాట్లాడుతూ 41 రోజుల దీక్షలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొనాలని కోరారు. సోమవారం కార్తీక పౌర్ణమి సందర్భంగా శ్రీరమా సహిత సత్యనారాయణస్వామి వ్రతాలు, పడి పూజ కార్యక్రమం ఉంటుందని తెలిపారు. కార్యక్రమంలో మాదారపు చంద్రశేఖరం, దొడ్డ రవీందర్, శ్రీరాం ఈశ్వరయ్య, చింతల కమలాకర్‌రెడ్డి, శ్రీరాముల శంకరయ్య, భూపతి లక్ష్మీనారాయణ, శింగిరికొండ వేణు, భూపతి రాజశేఖర్, కాట రఘు, కొల్లూరి లక్ష్మీనారాయణ పాల్గొన్నారు.

పవిత్రోత్సవాలు ప్రారంభం



గీసుకొండ: మండలంలోని ప్రసిద్ధ కొమ్మాల లక్ష్మీనర్సింహస్వామి ఆలయంలో శనివారం పవిత్రోత్సవాలు శనివారం ప్రారంభమయ్యాయి. ఉదయం విశ్వక్సేనారాధన, స్వస్తి పుణ్యాహవచనం, నవకలశ స్నపనం ఆరగింపు, తీర్థ ప్రసాద వితరణ, సాయంత్రం అంకురార్పణ, మత్స్యంగ్రహణ, దీక్షాధారణ, పవిత్ర ఆదివాసం, ఆరగింపు, తీర్థప్రసాద వితరణ తదితర పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఉత్సవాలు ఈ నెల 27వ తేదీన ముగుస్తాయని ఆలయ వంశపారంపర్య ధర్మకర్త చక్రవర్తుల శ్రీనివాసాచార్యులు తెలిపారు. ఈఓ శేషగిరి, అర్చకులు రామాచారి, విష్ణు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులు లక్ష్యాన్ని ఎంచుకోవాలి



నర్సంపేట రూరల్: విద్యార్థులు లక్ష్యాన్ని ఎంచుకుని చదవాలని నిట్ డీన్ ప్రొఫెసర్ వీటి సోమశేఖర్ పిలుపునిచ్చారు. నర్సంపేట మండలం లక్నేపల్లి గ్రామ శివారులోని బాలాజీ ఇంజనీరింగ్ కళాశాలలో శనివారం స్నాతకోత్సవం(గ్రాడ్యుయేట్స్ డే) ఘనంగా నిర్వహించారు. ముఖ్యఅతిథిగా ఆయన హాజరై విద్యార్థులకు పట్టాలు అందజేసి మాట్లాడారు. విద్యార్థులు భవిష్యత్ ప్రణాళికను రూపొందించుకుని ముందుకు సాగాలని సూచించారు. గ్రాడ్యుయేషన్ అనంతరం తరగతి గది నుంచి వర్క్‌ప్లేస్‌కు మారుతారని పేర్కొన్నారు. ప్రతి ఆచితూచి వేయాల్సి ఉంటుందని, పట్టభద్రులు ఆసక్తి ఉన్న రంగాలను ఎంచుకొని, సమాజానికి అవసరమైన పరిశోధనలు చేయాలని కోరారు. కార్యక్రమంలో బాలాజీ విద్యాసంస్థల చైర్మన్ చైర్మన్ డాక్టర్ ఎ.రాజేంద్రప్రసాద్ రెడ్డి, ప్రిన్సిపాళ్లు హరిహరన్, సంపత్, శ్యాంసుందర్, భానురేఖ, డీన్ స్టూడెంట్ ఆఫైర్స్ ఫణీంద్ర, ఏఓ సురేష్, అకడమిక్ కోఆర్డినేటర్ నారాయణ, ప్రోగ్రాం కోఆర్డినేటర్ చైతన్య, విద్యార్థులు, అధ్యాపకులు పాల్గొన్నారు.

కాంగ్రెస్‌తో మోసపోవద్దు





నెక్కొండ : రోడ్ షోకు హాజరైన ప్రజలు, బీఆర్ఎస్ శ్రేణులు, మాట్లాడుతున్న మంత్రి హరీశ్‌రావు, పక్కన బీఆర్ఎస్ నర్సంపేట ఎమ్మెల్యే అభ్యర్థి పెద్ది సుదర్శన్‌రెడ్డి

జంగ్ తెలంగాణ

హస్తం పార్టీ రిస్క్ వద్దు.. కారు గుర్తు ముద్దు

- ఐదు గ్యారెంటీలతో కర్నాటకలో ఖజానా ఖాళీ
- విద్యార్థులకు స్కాలర్‌షిప్‌లు ఇవ్వలేని దుస్థితి
- ఢిల్లీ పార్టీలను నమ్మితే గోస పడుతం
- ఎర్రబెల్లి, పెద్దిని భారీ మెజార్టీతో గెలిపించాలె..
- నెక్కొండ, పాలకుర్తి రోడ్‌షోల్లో మంత్రి హరీశ్‌రావు

నెక్కొండ/పాలకుర్తి టౌన్: ఆరు గ్యారంటీలతో మాయమాటలు చెప్పి ఓట్లు అడిగేందుకు వస్తున్న కాంగ్రెస్‌ను నమ్మి మోసపోవద్దని వైద్య, ఆరోగ్య, ఆర్థిక శాఖ మంత్రి తన్నీరు హరీశ్‌రావు అన్నారు. బీఆర్ఎస్ పాలకుర్తి అభ్యర్థి ఎర్రబెల్లి దయాకర్‌రావు తరఫున పాలకుర్తిలో, బీఆర్ఎస్ నర్సంపేట ఎమ్మెల్యే అభ్యర్థి పెద్ది సుదర్శన్‌రెడ్డి తరఫున శనివారం నెక్కొండలో నిర్వహించిన రోడ్ షోల్లో ఆయన మాట్లాడారు. 'ఎలక్షన్లు ఉన్నా లేకున్నా.. అందరి తలలో నాలుకలా ఉండే ఎర్రబెల్లి దయాకర్‌రావు గెలవాలా.. అమెరికా నుంచి నోట్ల కట్టలతో వచ్చిన ఎన్ఆర్ఐ గెలవాలా.. మనకు కాంగ్రెస్ రిస్క్ వద్దు.. ఆ పార్టీకి ఓటేసి ముప్పు తెచ్చుకోవద్దు.. కారు గుర్తు ముద్దు' అని అన్నారు. కరోనా వచ్చింది.. దయాకర్‌రావు వచ్చిండా రాలేదా చెప్పండి.. నా దగ్గరికి వచ్చి ప్రత్యేక కోటాలో మందులు తెచ్చుకుని మిమ్మల్ని కాపాడుకున్నడు. ఏ ఊరుకెళ్లినా సీసీ రోడ్లు వేసి మట్టి అంటకుండా చేయలేదా అని ప్రజలను అడిగారు. ఇంటింటా తాగునీరు, కాల్వల్లో సాగునీరు, గ్రామాల్లో మౌలిక వసతులు కల్పించిన ఎర్రబెల్లిని ఓడించేందుకు కాంగ్రెస్‌లో టికెట్ కొన్నవాళ్లు మిమ్మల్ని కొనగలరా అని ప్రశ్నించారు. దొడ్డి కొమురయ్య, చాకలి ఐలమ్మ, బమ్మెర పోతన, పాల్కురికి సోమనాథుడిని కన్న పాలకుర్తి గడ్డలో లీడర్లను కొన్నారేమో కానీ ఆత్మగౌరవం కలిగిన ప్రజలను కొనలేరని స్పష్టం చేశారు. ప్రియాంక, రాహుల్‌గాంధీ ఊదరగొట్టిన కర్ణాటకలో ఇచ్చిన గ్యారంటీలు అమలుకు నోచుకోలేదని ఎద్దేవా చేశారు. రేవంత్‌రెడ్డి చెప్పినట్లు మూడు గంటల కరెంట్ సరఫరా చేస్తే తిరిగి రాత్రి పూట రైతులు చావులు మొదలవుతాయి. కాంగ్రెసోళ్ల మాటలకు మోసపోతే గోస పడతం.. కరెంటు కావాలా.. కాంగ్రెస్ కావాలా తేల్చుకోవాలని సూచించారు. ఆసరా పథకం కింద ఇస్తున్న రూ.2వేల పింఛన్‌ను రూ.5 వేలకు పెంచుతామని వివరించారు. కల్యాణలక్ష్మి, రైతు బంధు, రైతుబీమా, ఇంటింటికీ మంచినీరు, 24 గంటల కరెంట్ ఇచ్చింది ఎవరో తెలుసు కదా అని జనంతో చెప్పించారు. కరోనాతో కొంత ఇబ్బంది ఏర్పడినా ప్రజాసంక్షేమాన్ని విస్మరించలేదని స్పష్టం చేశారు. రైతు రుణమాఫీ 75 శాతం చేశామని, ఎలక్షన్ కమిషన్ అనుమతిస్తే మిగిలిన 25 శాతం కూడా మాఫీ చేస్తామని హామీ ఇచ్చారు. దళిత, గిరిజన, బీసీ బంధు అమలు చేయాల్సి ఉందని, 12వ సారి అమలు చేసే రైతు బంధు పథకంలో భాగంగా ఎకరానికి రూ.16వేలు అందజేస్తామని స్పష్టం చేశారు. ఇంటింటా మిషన్ భగీరథ తాగునీరు వస్తోందని, సర్కారు దవాఖానలు మెరుగుపరిచిన ఘనత బీఆర్ఎస్ ప్రభుత్వానికే దక్కుతోందని పేర్కొన్నారు. మారుమూల గిరిజన తండాలను జీపీలుగా మార్చి స్వపరిపాలనకు శ్రీకారం చుట్టామని, దయాకర్‌రావును అత్యధిక మెజారిటీతో గెలిపిస్తే ఈసారి గిరిజన బంధు ఇస్తామని, పాలకుర్తి రూపురేఖలు మరింత మారుతాయి.. అంతేకాదు ఎర్రబెల్లి సీనియర్ మంత్రి అయిండు.. పవర్ ఫుల్ ఉండాలన్నా పాలకుర్తిలో గులాబీ జెండా ఎగురవేయాలని కోరారు.

కాంగ్రెస్‌కు ఓటు వేస్తే కరెంట్ కష్టాలు..

కాంగ్రెస్‌కు ఓటు వేస్తే కరెంట్ కష్టాలు కొని తెచ్చుకున్నట్లేనని చెప్పారు. రైతుబంధు ఆపాలని కాంగ్రెస్ కుట్ర చేసిందని, కేంద్ర ఎన్నికల సంఘం (సీఈసీ) అనుమతి ఇచ్చిందని, రెండు రోజుల్లో రైతుల ఖాతాల్లో నగదు జమ కానుందని పేర్కొన్నారు. మార్పు కోసం తమకు ఓటు వేయాలని అంటున్న కాంగ్రెస్.. 24 గంటల కరెంట్‌కు బదులు మూడు గంటల కరెంట్ ఇవ్వడమేనా మార్పు అని ప్రశ్నించారు. భూమి ఎంత ఉన్నా రైతుకు రూ.15 వేలు మాత్రమే ఇస్తామని చెబుతున్నారని, తాము ఎకరాకు రూ.16 వేలు ఇస్తామని ఆయన తెలిపారు. రైతుబీమా, కల్యాణలక్ష్మి, ఆసరా పింఛన్లు, కేసీఆర్ కిట్లు.. ఇలా అన్ని వర్గాల సంక్షేమానికి బీఆర్ఎస్ ప్రభుత్వం కృషి చేస్తోందని ఆయన పేర్కొన్నారు. మళ్లీ అధికారంలోని వచ్చాక వివిధ పథకాలు పక్కాగా అమలవుతాయని స్పష్టం చేశారు. ఐదు గ్యారెంటీలతో కర్ణాటకలో ఖజానా ఖాళీ అయ్యిందని, అక్కడ అమలు కాని ఆరు గ్యారెంటీలను ఇక్కడి ప్రజలు ఎలా నమ్ముతారని మంత్రి ప్రశ్నించారు. కనీసం కర్ణాటకలో విద్యార్థులకు స్కాలర్‌షిప్‌లు అందించలేని దుస్థితి నెలకొందని విమర్శించారు. కేసీఆర్‌ను ఓడించడానికి కాంగ్రెస్, బీజేపీ కుట్రలు చేస్తున్నాయన్నారు. ఢిల్లీ పార్టీలను నమ్మితే గోసపడుతామని పేర్కొన్నారు. ప్రియాంకగాంధీ ఉత్తరప్రదేశ్ ఎన్నికల ప్రచారంలో పాల్గొంటే రెండే సీట్లు వచ్చాయని మంత్రి గుర్తు చేశారు. పెద్ది సుదర్శన్‌రెడ్డిని అధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు. రాష్ట్రంలో కేసీఆర్ ప్రభుత్వమే రానుందని, నెక్కొండలో సివిల్ ఆస్పత్రి ఏర్పాటు, నెక్కొండను మున్సిపాలిటీ చేస్తామని హరీశ్‌రావు హామీ ఇచ్చారు. పాలకుర్తి రోడ్‌షోలో ఆరోగ్యశ్రీ హెల్త్ కేర్ ట్రస్ట్ స్టేట్ చైర్మన్ డాక్టర్ ఎస్.సుధాకరావు, నెక్కొండ రోడ్ షోలో వరంగల్ జెడ్పీ ఫ్లోర్‌లీడర్ పెద్ది స్వప్న, పీపీ అబ్దుల్‌నబీ, నర్సంపేట బార్ అసోసియేషన్ అధ్యక్షుడు కొమ్ము రమేష్‌యాదవ్, జెడ్పీటీసీ లావుడ్యా సరోజ, ఎంపీపీ జాటోతు రమేష్‌నాయక్, మండల, పట్టణ అధ్యక్షులు సంగని సూరయ్య, కొణిజేటి భిక్షపతి పాల్గొన్నారు.

కాంగ్రెస్, బీజేపీ ఎత్తుగడలు సాగవు : పెద్ది సుదర్శన్‌రెడ్డి, నర్సంపేట



మాజీ ఎమ్మెల్యేలు దొంతి మాధవరెడ్డి, రేవూరి ప్రకాశ్‌రెడ్డి ఒక్కటై తనను ఓడించాలని చూస్తున్నారని పెద్ది సుదర్శన్‌రెడ్డి ఆరోపించారు. ఇదేం కొత్త కాదని 2014లో ఇండిపెండెంట్ డ్రామాలాడి తనను ఓడించారని, 2018లో మరోసారి నర్సంపేటలో దొంతి, మరోచోట రేవూరి ఎన్నికల్లో పోటీ చేసిన విషయాన్ని గుర్తు చేశారు. తిరిగి ఇద్దరు వేర్వేరు చోట్ల కాంగ్రెస్ అభ్యర్థులుగా పోటీలో ఉన్నారని, వారి ఎత్తుగడలు నర్సంపేటలో సాగవని, నియోజక వర్గ ప్రజలు గెలిపిస్తారని ధీమా వ్యక్తం చేశారు.

నలభై ఏళ్లలో ఎన్నో చేశా: ఎర్రబెల్లి దయాకర్‌రావు, పాలకుర్తి



నలభై ఏళ్ల రాజకీయ జీవితంలో ఎన్నో కార్యక్రమాలు చేపట్టాను.. మరోసారి తనకు అవకాశం కల్పించాలని పాలకుర్తి అభ్యర్థి ఎర్రబెల్లి దయాకర్‌రావు కోరారు. నియోజకవర్గంలోని అన్ని గ్రామాల్లో సాగు, తాగు నీరు, రోడ్ల అభివృద్ధి, ఇళ్ల నిర్మాణాలు, విద్య వంటి వసతులు కల్పించానని అన్నారు. వల్మిడి, బమ్మెర, పాలకుర్తి గ్రామాలను పర్యాటక ప్రాంతాలుగా అభివృద్ధి చేశానని, యువతకు ఉపాధి అవకాశాలు కల్పించినట్లు చెప్పారు.



పాలకుర్తి రోడ్‌షోకు హాజరైన ప్రజలు, బీఆర్ఎస్ శ్రేణులు



అభివాదం చేస్తున్న మంత్రి హరీశ్‌రావు, పక్కన బీఆర్ఎస్ పాలకుర్తి అభ్యర్థి ఎర్రబెల్లి దయాకర్‌రావు

ఎయిడ్స్ బాధితులపై వివక్ష వద్దు

వర్ధన్నపేట: ఎయిడ్స్ బాధితులపై వివక్ష చూపకూడదని, హెచ్ఐవీపై సమాజంలో ఇప్పటికీ ఎన్నో అపోహలు, అనుమానాలు ఉన్నాయని సర్వోదయ యూత్ ఆర్గనైజేషన్ స్వచ్ఛంద సంస్థ ప్రోగ్రాం మేనేజర్ శాంతరాజ్ అన్నారు. డిసెంబర్ 1న ప్రపంచ ఎయిడ్స్ నివారణ దినోత్సవాన్ని పురస్కరించుకుని సర్వోదయ యూత్ స్వచ్ఛంద, రాష్ట్ర ఎయిడ్స్ నియంత్రణ మండలి, ఉమ్మడి వరంగల్ జిల్లా ఎయిడ్స్ నియంత్రణ మండలి ఆధ్వర్యంలో ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో శనివారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈసందర్భంగా శాంతరాజ్ మాట్లాడుతూ సురక్షితం కాని లైంగిక సంబంధాలు, తల్లిపాల ద్వారా తప్ప మరే ఇతర మార్గాల్లో హెచ్ఐవీ సోకదని ఇప్పటికే నిర్ధారణ అయ్యిందని తెలిపారు. యువత సన్మార్గంలో నడవాలని సూచించారు. అనంతరం విద్యార్థులకు చర్చ, వ్యాసరచన, ముగ్గులు, డ్రాయింగ్ పోటీలు నిర్వహించినట్లు చెప్పారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ పోశయ్య, డాక్టర్ ఎం.సమత, ప్రొఫెసర్లు డాక్టర్ సంధ్య, డాక్టర్ కవిత, మాలతిలత, శ్రీనివాసరావు, శ్వేత, సుధారాణి, అధ్యాపకులు జ్యోతిమాదేవి, కృష్ణ, దేవేందర్, సుధారాణి, సిబ్బంది ప్రవళిక, మురళి, సరోజన, యాకయ్య తదితరులు పాల్గొన్నారు.



అవగాహన సదస్సులో భాగంగా ముగ్గులు వేస్తున్న విద్యార్థులు

'సెమినార్' పత్రాలు పంపండి

విద్యారణ్యపురి: రాష్ట్ర విద్యా పరిశోధన, శిక్షణ మండలి ద్వారా నిర్వహిస్తున్న ఒక రోజు గణిత ఉపాధ్యాయుల సెమినార్‌లో భాగస్వాములు కావాలని హనుమకొండ జిల్లా విద్యాశాఖ అధికారి డాక్టర్ ఎండీ అబ్దుల్‌హై శనివారం ఒక ప్రకటనలో కోరారు. సమకాలీన ప్రపంచ నిర్మాణానికి బాలలకు దోహదం చేయడంలో గణితశాస్త్రం పాత్ర ప్రధానాంశంలో వివిధ క్షేత్రాల్లో బాధ్యతాయుతమైన సుస్థిరమైన ఆచరణల వ్యాప్తిలో గణిత శాస్త్రం పాత్ర, '21వ శతాబ్దపు నైపుణ్యాల కోసం గణిత విద్య, సమానత్వం, అంతర్భాగం కోసం గణిత శాస్త్రం, ఉద్భవిస్తున్న క్షేత్రాల్లో ప్రగతికోసం గణిత శాస్త్రం ద్వారా విద్యర్థుల్ని సిద్ధం చేయడం అనే నాలుగు అంశాల్లో ఏదైనా అంశంలో సెమినార్ పత్రాలు రూపొందించి డిసెంబర్ 10లోగా ఎస్‌సీఈఆర్‌టీకి పంపాల్సిందిగా డీఈఓ కోరారు.

కౌంటింగ్‌కు ఏర్పాట్లు చేయాలి

- జిల్లా ఎన్నికల అధికారి కలెక్టర్ పి.ప్రావీణ్య

కరీమాబాద్: డిసెంబర్ 3న జరిగే ఎన్నికల కౌంటింగ్ ఏర్పాట్లు పకడ్బందీగా చేయాలని, ఎన్నికల కమిషన్ నిబంధనలు పాటించాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ పి.ప్రావీణ్య అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్ సమావేశ మందిరంలో ఆర్ఓలు షేక్ రిజ్వాన్‌బాషా, అశ్విని తానాజీవాకడే, కృష్ణవేణితో కలిసి ఎన్నికల అధికారులతో కౌంటింగ్ ఏర్పాట్లు, పోస్టల్ బ్యాలెట్, తదితర అంశాలపై కలెక్టర్ సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలోని నర్సంపేట, వర్ధన్నపేట, వరంగల్ తూర్పు అసెంబ్లీ నియోజకవర్గాల ఓట్ల లెక్కింపు ఏనుమాముల మార్కెట్ యార్డులో ఉంటుందని తెలిపారు. కౌంటింగ్‌కు సంబంధించి అన్ని విషయాలపై పూర్తి అవగాహన ఉండాలన్నారు. కౌంటింగ్ కేంద్రంలో లేఅవుట్ ప్రకారం ఏర్పాట్లు, కమ్యూనికేషన్ ప్లాన్, స్పీడ్ ఇంటర్నెట్ సౌకర్యం ఉండాలన్నారు. ఓట్ల లెక్కింపు విధులు నిర్వర్తించే సిబ్బందికి గుర్తింపు కార్డులు ఇవ్వాలని ఆదేశించారు. కౌంటింగ్, స్ట్రాంగ్ రూంల వద్ద సీసీ కెమెరాల ఏర్పాటు, వీడియోగ్రఫీ, పటిష్ట భద్రతా చర్యలు తదితర అంశాలపై అధికారులకు సూచనలు చేశారు. ఎన్నికల ఓట్ల లెక్కింపులో పాల్గొనే ఉద్యోగులు, ఎలక్షన్ ఏజెంట్లకు వేర్వేరు ఎంట్రీ, ఎగ్జిట్ ఉండాలన్నారు. రెండు వైపులా గార్డులను ఏర్పాటు చేయాలన్నారు. ఆయా నియోజకవర్గాలకు సంబంధించి వాహన పార్కింగ్ ఏర్పాట్లు చేయాలని, ఓట్ల లెక్కింపు కేంద్రాల్లో విద్యుత్ అంతరాయం కలుగకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. మీడియా కవరేజీ చేయాల్సిన విధానం, మీడియా సెంటర్‌లో చేయాల్సిన ఏర్పాట్లపై దిశానిర్దేశం చేశారు. నిబంధనల మేరకు కౌంటింగ్ కేంద్రాలు, స్ట్రాంగ్ రూంల వద్ద పటిష్ట భద్రతా ఏర్పాట్లు ఉండాలన్నారు. సమావేశంలో ఆర్డీఓ వాసుచంద్ర, అడిషనల్ ఆర్‌ఓ అనిసుర్ రషీద్ తదితరులు పాల్గొన్నారు.



కౌంటింగ్ ఏర్పాట్లపై మాట్లాడుతున్న కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి ప్రావీణ్య

28 సాయంత్రం 5 గంటలలోగా ప్రచారం నిలిపివేయాలి

వరంగల్: ఎన్నికల ప్రవర్తన నియమావళి ప్రకారం వివిధ రాజకీయ పార్టీల నాయకులు ఈనెల 28వ తేదీ సాయంత్రం 5గంటలలోగా ప్రచారం నిలిపివేయాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ పి.ప్రావీణ్య అన్నారు. కలెక్టర్‌లో శనివారం జరిగిన సమావేశంలో కలెక్టర్ మాట్లాడారు. కేంద్ర ఎన్నికల సంఘం మార్గదర్శకాల మేరకు స్వేచ్ఛాయుత ప్రశాంత పారదర్శక వాతావరణంలో ఎన్నికలు నిర్వహించేందుకు అన్ని చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు.ఇందుకోసం రాజకీయ పార్టీల ప్రతినిధులు సహకరించాలని కోరారు. ఓటరు స్లిప్పులు 98శాతం పంపిణీ చేశామని కలెక్టర్ చెప్పారు. పోలింగ్ ప్రారంభానికి ముందు 90 నిమిషాలు మాక్ పోల్ నిర్వహించాలని ఆదేశించారు. మాక్ పోల్ నిర్వహణ అనంతరం ఎలక్షన్ ఏజెంట్ల సమక్షంలో ఎలక్ట్రానిక్ ఓటింగ్ యంత్రాలు సీల్ చేసేవరకు తప్పనిసరిగా ఉండాలని పేర్కొన్నారు. ఈవీఎంలు మరమ్మతులకు గురైతే పోలింగ్‌కు ఎటువంటి అంతరాయం కలుగకుండా రిజర్వ్‌లో ఉన్న ఈవీఎంలతో పోలింగ్ నిర్వహించే విధంగా చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. ఓటుకు గుర్తింపు తప్పనిసరి అని ఎన్నికల సంఘం సూచించిన 12 గుర్తింపు కార్డుల్లో ఏదో ఒకటి ఓటరు వెంట ఉండాలని చెప్పారు.

'తూర్పు'లో మిగిలిందేంటి?

తరలిన టీ–హబ్, మెడికల్, నర్సింగ్ కాలేజీలు

- జిల్లా విభజనలో పోయిన విద్యాసంస్థలు
- అసంపూర్తిగానే అభివృద్ధి పనులు



ఎనిమిదేళ్లుగా ప్రారంభానికి నోచుకోని మ్యూజియం

వరంగల్: కొత్త జిల్లా అయిందని సంతోషించాలా.. ఉన్నవి తరలిపోయాయని బాధపడాలో తెలియని స్థితిలో వరంగల్ తూర్పు నియోజకవర్గ ప్రజలున్నారు. జిల్లాల విభజన సమయంలో వరంగల్ తూర్పు,పశ్చిమ,పరకాల నియోజకవర్గాలను కలిపి వరంగల్ అర్బన్ జిల్లాగా ఏర్పాటు చేశారు. తూర్పు నియోజకవర్గ కేంద్రంగా వరంగల్ రూరల్ జిల్లాను ఏర్పాటు చేయాలని అధికారపార్టీ నాయకులు సీఎం కేసీఆర్‌పై ఒత్తిడి తేవడంతో వరంగల్ తూర్పు కేంద్రంగా నర్సంపేట,వర్ధన్నపేట నియోజకవర్గాలతో వరంగల్‌జిల్లాగా రూపాంతరం చెందగా.. వరంగల్ పశ్చిమతో పరకాల, హుజురాబాద్, వర్ధన్నపేట, స్టేషన్ ఘన్‌పూర్ నియోజకవర్గాల్లోని(7) మండలాలతో హనుమకొండ జిల్లా ఏర్పాటైంది. వరంగల్, హనుమకొండ జిల్లాల ఏర్పాటు సమయంలో వరంగల్ మండల పరిధిలోని రెవెన్యూ గ్రామాలను లెక్కల్లోకి తీసుకోకపోవడంతో వరంగల్‌లోని కేఎంసీ మెడికల్ కాలేజీ, సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రి (పీఎంఎస్ఎస్‌వై), ప్రభుత్వ పాలిటెక్నిక్ కాలేజీలు, మున్సిపల్ కార్పొరేషన్, చారిత్రక భద్రకాళి ఆలయం, ఉత్తర తెలంగాణకు చెందిన ధార్మిక భవన్, ఎల్‌బీ కాలేజీ హనుమకొండ జిల్లాలోకి వెళ్లాయి.హనుమకొండ జిల్లా పరిధిలో ప్రముఖ విద్యాసంస్థలు, యూనివర్సిటీలు ఎన్ఐటీ, కేయూ, ఎస్‌డీఎల్‌సీఈ, జెఎన్ఎస్, పోలీసు ట్రైనింగ్ కాలేజీలు ఉన్నాయి. వరంగల్ జిల్లా పరిధిలో అగ్రికల్చర్ కాలేజీ,కాళోజీ హెల్త్ యూనివర్సిటీలు మాత్రమే ఉండగా.. ఎంతో గుర్తింపు పొందిన వరంగల్ జిల్లాలోని విద్యాసంస్థలు తరలిపోయాయని ఈ ప్రాంత ప్రజల్లో అభిప్రాయాలు వ్యక్తంఅవుతున్నాయి.

హామీలుగానే మిగిలిన పనులు..

వరంగల్ తూర్పు నియోజకవర్గంలో ప్రజలకు చెబుతున్న విధంగా అభివృద్ధి పనులు పూర్తి చేయడంలో అధికార పాలనాయంత్రాంగం ఘోరంగా విఫలమైందని చెప్పొచ్చు. తూర్పులో వరద ముంపు నివారణ కోసం ప్రభుత్వం రూ.77.50 కోట్లు మంజూరు అయినప్పటికీ పనులు అసంపూర్తిగా ఉండగా.. కొన్ని ప్రారంభం కాలేదు. రూ.వందల కోట్ల నిధులు కేటాయింపుల జరిగినా రూ.75కోట్ల బస్టాండ్, రూ.50కోట్ల శివనగర్ అండర్ గ్రౌండ్ డ్రైయినేజీ, ఉర్సు బండ్, చెరువు అభివృద్ధి పనులు, కమ్యూనిటీ హాల్ నిర్మాణం, మ్యూజియం, ఏనుమాముల–నర్సంపేట బైపాస్ రోడ్డు, స్మార్ట్‌లో చేపట్టిన రోడ్లు అన్ని అసంపూర్తిగా ఉండగా.. మరికొన్ని పనులు ప్రారంభం కాలేదు. ఇలా చెప్పుకుంటూ పోతే తూర్పులో ఒక్క రోడ్డు సైతం పూర్తి కాలేదు. మొత్తం అతుకులమయంగానే ఉన్నాయి.



శివనగర్ మసీదు సమీపంలో నిలిచిన అండర్ గ్రౌండ్ డక్ట్ అండ్ డ్రైయిన్ పనులు

వడ్లకొండలో కేఆర్ నాగరాజు వర్గీయుల ఘర్షణ

- కారు అద్దాలు ధ్వంసం.. ఒకరికి తీవ్ర గాయాలు

పర్వతగిరి: పార్టీలో ఉంటూ సమాచారం ఇతరులకు చేరవేస్తున్నారన్న అనుమానంతో కాంగ్రెస్ వర్ధన్నపేట అభ్యర్థి కేఆర్ నాగరాజు వర్గీయులే ఒకరికొకరు ఘర్షణ పడ్డారు. వారిలో ఒకరి పరిస్థితి విషమంగా ఉన్నట్లు తెలిసింది. ఈ ఘటన శుక్రవారం రాత్రి జరగగా శనివారం వెలుగులోకి వచ్చింది. పర్వతగిరి మండలంలో శుక్రవారం చేపట్టిన ప్రజా దీవెన యాత్ర వివిధ గ్రామాలు తిరుగుతూ పర్వతగిరి గ్రామంలో రాత్రి 10 గంటలకు ముగిసింది. అనంతరం కేఆర్ నాగరాజు వర్గీయులు వరంగల్‌కు వెళుతున్న క్రమంలో వడ్లకొండ గ్రామం వద్ద అదే పార్టీకి చెందిన 20మంది వ్యక్తులు అడ్డగించారు. ఇద్దరు వ్యక్తులపై దాడి చేయడంతో వారిలో ఒకరి పరిస్థితి విషమంగా ఉందని సమాచారం. దాడికి గల కారణాలను పరిశీలిస్తే.. ఒక వర్గానికి చెందిన నలుగురు వ్యక్తులు పార్టీలో జరిగే సమాచారాన్ని ఇతరులకు చేరవేస్తున్నారనే అనుమానంతో ఈ దాడి చేసినట్లు తెలిసింది. ఘర్షణ పడివారిలో ఒక వర్గం వ్యక్తులు అభ్యర్థి కేఆర్ నాగరాజు క్లాస్‌మెట్ వర్గీయులు కాగా, మరో వర్గం నాగరాజు కుమారుడి క్లాస్‌మెట్, అనుచరులుగా తెలుస్తోంది. ఘర్షణలో కారు అద్దాలు పగిలాయి. చివరికి అభ్యర్థి నాగరాజు ఇరు వర్గాలను సముదాయించి గాయపడిన వ్యక్తిని ఆస్పత్రిలో చేర్పించినట్లు సమాచారం.

6 నుంచి కేయూ ఎంసీఏ పరీక్షలు

కేయూ క్యాంపస్: ఎంసీఏ మొదటి సంవత్సరం ఫస్ట్ సెమిస్టర్ (నాన్ సీబీసీఎస్ థర్డ్ ఇయర్ డ్యూరేషన్) ఎక్స్ విద్యార్థులకు డిసెంబర్ 6 నుంచి పరీక్షలు నిర్వహిస్తున్నట్లు కేయూ పరీక్షల నియంత్రణాధికారి మల్లారెడ్డి తెలిపారు. డిసెంబర్ 6, 11, 14, 18, 21 తేదీల్లో పరీక్షలు మధ్యాహ్నం 10 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటిగంటవరకు నిర్వహిస్తారని పేర్కొన్నారు. ఎంసీఏ మొదటి సంవత్సరం రెండో సెమి స్టర్ పరీక్షలు (నాన్‌సీబీసీఎస్ థర్డ్– ఇయర్ డ్యూ రేషన్)ఎక్స్ విద్యార్థులకు డిసెంబర్ 6, 11, 14, 18 తేదీల్లో మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 5 గంటల వరకు నిర్వహిస్తారని వారు తెలిపారు.

ప్రజాసేవ చేసేందుకే వచ్చాం


రాయపర్తి : ప్రచారంలో మాట్లాడుతున్న యశస్విని రెడ్డి


దేవరుప్పుల : కొత్తకాలనీ ప్రచారంలో పాల్గొన్న కృష్ణమూర్తి

- కాంగ్రెస్ పాలకుర్తి అభ్యర్థిని యశస్విని రెడ్డి
- కోలాటాలు, డప్పుచప్పుళ్లతో స్వాగతం పలికిన ప్రజలు

రాయపర్తి : మేం ఆస్తులు కూడబెట్టేందుకు రాజకీయాల్లోకి రాలేదని, ప్రజాసేవ చేసేందుకే వచ్చామని కాంగ్రెస్ పార్టీ పాలకుర్తి నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థిని మామిడాల యశస్వినిరెడ్డి అన్నారు. పల్లెపల్లెకు కాంగ్రెస్ గడప గడపకు ఝాన్సమ్మ కార్యక్రమంలో భాగంగా శుక్రవారం మండలంలోని కిష్టాపురం, పన్యానాయక్ తండాల్లో ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమెకు కోలాటాలు, డప్పు చప్పుళ్లతో ఘనస్వాగతం పలికారు. అనంతరం ఆమె మాట్లాడుతూ ఏళ్ల తరబడి ఎమ్మెల్యేగా గెలిచిన దయాకర్ రావు చేసిన అభివృద్ధి శూన్యం అన్నారు. ఇచ్చిన మాటకు కట్టుబడి ఉండే పార్టీ కాంగ్రెస్ అన్నారు. బీఆర్ఎస్ బూటకపు హామీలు ఇస్తుందన్నారు. సొంత ఇంటి కలను నెరవేర్చలేదన్నారు. యువకులకు ఉద్యోగాలు కల్పించాల్సింది పోయి బెల్ట్ షాపులు పెంచి తాగుడుకు బానిసలను చేసిందన్నారు. కాంగ్రెస్ అధికారంలోకి రావడం ఖాయమని వెంటనే ఇళ్ల స్థలాలు ఇవ్వడంతో పాటు ఇళ్లు కట్టుకునేందుకు ఒక్కొక్కరికి రూ.5 లక్షలు, ఎస్సీ ,ఎస్టీలకు రూ.6 లక్షలు ఇవ్వనున్నట్లు తెలిపారు. గిరిజనులకు అండగా కాంగ్రెస్ నిలుస్తుందన్నారు. తనకు వచ్చే జీతాన్ని సైతం ప్రజాసేవకే వినియోగిస్తానన్నారు. కాంగ్రెస్ ప్రవేశ పెట్టిన ఆరు గ్యారంటీ స్కీంలు తప్పక అమలు అవుతాయన్నారు. కాంగ్రెస్ గెలుపు తథ్యం అన్నారు. కార్యక్రమంలో బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు జాటోత్ అమ్యానాయక్,, కుందూరు గోపాల్‌రెడ్డి, సరికొండ కృష్ణారెడ్డి, రెంటాల గోవర్ధన్ రెడ్డి, మాచర్ల ప్రభాకర్, తదితరులు పాల్గొన్నారు.


రాయపర్తి : ప్రచారంలో పాల్గొన్న యశస్వినిరెడ్డి

బీఆర్ఎస్‌కు పట్టంకడితే అధోగతే..

దేవరుప్పుల : బీఆర్ఎస్‌కు మరోసారి నమ్మి పట్టం గడితే నిరుద్యోగ్యులకు శాపంగా మారడమేగాక వనరులు దోపిడీ చేసి మనల్ని అధోగతి పాలు చేయడం ఖాయమని పాలకుర్తి దేవస్థాన కమిటీ మాజీ చైర్మన్ సిలువేరు కృష్ణమూర్తి అన్నారు. శనివారం మండల కేంద్రంలోని కొత్తకాలనీలో పాలకుర్తి కాంగ్రెస్ అభ్యర్థి యశస్వినిరెడ్డి గెలుపు కోసం ఇంటింటా ప్రచారం చేసి ఓటింగ్ విధానంపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో సీనియర్ నాయకులు కాసారపు ధర్మారెడ్డి, తోటకూరి పాండు కృష్ణ, రమేష్, రామచంద్రారెడ్డి, చెల్మారెడ్డి, మల్లయ్య పాల్గొన్నారు.

అమరుల కలలు సాకారం చేస్తున్న కేసీఆర్

- పంచాయతీరాజ్ శాఖ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు


దేవరుప్పుల : కడవెండి ప్రచార సభలో మాట్లాడుతున్న ఎర్రబెల్లి దయాకర్‌రావు

దేవరుప్పుల : నాటి, నేటి తెలంగాణ సాధనలో అసువులు బాసిన అమరుల కలలు సాకారం చేస్తున్న ఘనత సీఎం కేసీఆర్‌కు దక్కుతుందని పంచాయతీరాజ్ శాఖ మంత్రి, బీఆర్ఎస్ పాలకుర్తి అభ్యర్థి ఎర్రబెల్లి దయాకర్‌రావు అన్నారు. శనివారం మండలంలోని కడవెండి, ధర్మాపురంలో ఆయన ఎన్నికల ప్రచారంలో ఎర్రబెల్లికి గులాబీ శ్రేణులు సాంస్కృతిక సంప్రదాయాలు, ఆటపాటలతో ఘనస్వాగతం పలికారు. తెలంగాణ తొలి అమరుడు దొడ్డి కొమురయ్య స్మారక విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. 50 ఏళ్ల పాలన చేసిన కాంగ్రెస్ హయాంలో జరిగిన అభివృద్ధితో బీఆర్ఎస్ ప్రభుత్వం చేసిన శాశ్వత ప్రాతిపదికన పనులు, రైతు సంక్షేమ పథకాలను బేరీజు వేసుకోవాలని సూచించారు. తండాల స్వయంసమృద్ధి సాధించే దిశలో స్వపరిపాలన కోసం తండాలను పంచాయతీలు చేసిన ఘనత బీఆర్ఎస్‌కే దక్కుతుందన్నారు. రేలారేలా గంగవ్వ, కనకవ్వ జానపద గేయాలతో ప్రభుత్వ పథకాలపై రక్తి కట్టించారు. కార్యక్రమంలో ఎస్ఆర్ఐ ఎర్రంరెడ్డి తిరుపతిరెడ్డి, ప్రజాప్రతినిధులు, బీఆర్ఎస్ నాయకుల బెల్లీనా లీనారెడ్డి, దుబ్బాక కవితరత్నాకర్‌రెడ్డి, మదార్, మహేష్, హన్మంతు, అశోక్, ఉపేందర్, కృష్ణమూర్తి, రమేష్, సాయిలు, సతీష్, లాలునాయక్, యాకయ్య, చిరంజీవి పాల్గొన్నారు.

భారీగా తరలిన గులాబీ శ్రేణులు

ఎర్రబెల్లి దయాకర్‌రావు గెలుపు కోసం తలపెట్టిన రోడ్‌షో కోసం మండల వ్యాప్తంగా గులాబీ శ్రేణులు భారీగా తరలివెళ్లారు. ఈ సందర్భంగా మండల సమన్వయకర్త పల్లా సుందర్‌రామిరెడ్డి మాట్లాడుతూ ఇంటింటా కేసీఆర్ సంక్షేమ పథకాలు పొందిన లబ్ధిదారులు ముచ్చటగా మూడోసారి సీఎం కేసీఆర్, మంత్రి దయన్నకు అత్యధిక మెజారిటీతో పట్టంగట్టడం ఖాయమన్నారు.

మంత్రి సమక్షంలో బీఆర్ఎస్‌లో చేరిక

కొడకండ్ల : మండలంలోని చెరువుముందు తండాకు చెందిన గిరిజనులు రాష్ట్ర పంచాయతీరాజ్ శాఖ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు సమక్షంలో శనివారం బీఆర్ఎస్‌లో చేరారు. మండల ఇన్‌చార్జ్ భానుకిరణ్‌రావు, బీఆర్ఎస్ నాయకుడు ధరావత్ వీరన్ననాయక్ ఆధ్వర్యంలో తండాకు చెందిన సోమన్న, శ్రీను, యాకూబ్, వెంకన్న, నవీన్ తదితరులు బీఆర్ఎస్‌లో చేరారు.


దేవరుప్పుల : నీర్మాల నుంచి రోడ్‌షోకు తరలుతున్న గులాబీ శ్రేణులు


కొడకండ్ల : మంత్రి సమక్షంలో బీఆర్ఎస్‌లో చేరిన గిరిజనులు

కొండచిలువ హతం

బచ్చన్నపేట : మండలంలోని కొడవటూర్ వద్ద కొండ చిలువను చంపిన సంఘటన శనివారం చోటు చేసుకుంది. గ్రామ రైతులు తెలిపిన వివరాల ప్రకారం... కొడవటూర్ సిద్దులగుట్ట వద్ద రోడ్డుకు అడ్డంగా పెద్ద శబ్దం చేస్తూ వెళ్తున్న కొండచిలువను గమనించిన రైతులు కర్రలతో చంపేశారు.రాత్రివేళ వ్యవసాయ బావుల వద్దకు వెళ్లాలంటే భయం వేస్తుందన్నారు.

ఇంటర్ యూనివర్సిటీ టోర్నమెంట్‌కు కేయూ జట్లు

కేయూ క్యాంపస్ : పంజాబ్ రాష్ట్రం మొహాలిలోని చండీఘర్ యూనివర్సిటీలో ఈనెల 28 నుంచి డిసెంబర్ 1 వరకు నిర్వహించబోయే సౌత్ వెస్ట్‌జోన్ ఇంటర్ యూనివర్సిటీ రెజ్లింగ్ టోర్నమెంట్‌కు కాకతీయ యూనివర్సిటీ పురుషుల, మహిళల జట్లను ఎంపిక చేసినట్లు శనివారం కేయూ స్పోర్ట్స్ బోర్డు సెక్రటరీ ఆచార్య శ్రీనివాస్‌రావు తెలిపారు. రెజ్లింగ్ ఫ్రీ స్టైయిల్ పురుషుల జట్టులో వి.భరత్, ఎస్.కార్తీక్ (న్యూసైన్స్ డిగ్రీ కళాశాల, హనుమకొండ), బి.అఖిల్ (ఎల్‌బీ కాలేజీ వరంగల్), ఎన్.నితిన్, బి.అఖిల్ (కేడీసీ హనుమకొండ), ఎ.భాను ప్రకాశ్ (ఐటీడబ్ల్యూ ఆర్‌డీసీ మణగూరు), రెజ్లింగ్ గ్రేకోరోమన్ పురుషుల జట్టులో సీహెచ్. ప్రియతమ్ (న్యూసైన్స్ డిగ్రీ కాలేజీ ,హనుమకొండ), కె.అఖిల్ (వాగ్దేవి డిగ్రీ కాలేజీ హనుమకొండ), ఎస్‌డీ.ముబీన్ (యూఏఎస్‌సీ హనుమకొండ), జి.తిరుపతి, ఎస్ వినయ్‌కుమార్ (యూసీపీఈ కేయూ), ఎ.వినోద్ శ్రీకేవీఎస్ డిగ్రీ కాలేజి కురవి, మహబూబాబాద్) ఉన్నారు.

ఉమెన్ కేయూ జట్టు

కేయూ రెజ్లింగ్ మహిళల జట్టులో ఎస్.మహేశ్వరీ, కె.సంతోషి, ఇ.వెన్నెల, కె.రేణుక (ఐటీడబ్ల్యూ ఆర్‌డీసీ కొత్తగూడెం), షేక్ రెహానా (యూఏఎస్‌సీ హనుమకొండ), జె. మాధురి (కేవైఎస్ వరంగల్), కె. ఓంప్రశాంతి(టీఎస్‌డబ్ల్యూ ఆర్‌డీసీ వరంగల్‌వెస్ట్), పి.రమ్య (యూసీపీఈ కేయూ) ఉన్నారని తెలిపారు. పురుషుల, మహిళల జట్లకు వరంగల్‌లోని బొల్లికుంట వాగ్దేవి ఫిజికల్ ఎడ్యూకేషన్ కాలేజి ఫిజికల్ డైరెక్టర్ పి.లక్ష్మీపతి మేనేజర్‌గా వ్యవహరిస్తారని ఆయన తెలిపారు.

ఓటు హక్కు వినియోగించుకోవాలి

హన్మకొండ అర్బన్ : ప్రతిఒక్కరూ ఓటు హక్కు వినియోగించుకొనేలా అధికారులు కృషి చేయాలని, ఎన్నికల విధుల్లో పాల్గొనే ఉద్యోగులందరూ తప్పనిసరిగా పోస్టల్ బ్యాలెట్ సౌకర్యాన్ని విధిగా ఉపయోగించుకోవాలని తెలంగాణ గెజిటెడ్ ఆఫీసర్స్ అసోసియేషన్ ఉమ్మడి వరంగల్ జిల్లా కోఆర్డినేటర్ ఎన్నమనేని జగన్మోహన్‌రావు తీర్మానించారు. శనివారం హనుమకొండ ఐడీఓసీలోని టీజీఓ భవన్‌లో అసోసియేషన్ ఉమ్మడి జిల్లా యూనిట్ల సంయుక్త కార్యవర్గ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో అసోసియేషన్ కార్యవర్గ సభ్యులు పాల్గొని గెజిటెడ్ అధికారుల సమస్యలపై చర్చించి, పలు తీర్మానాలు చేశారు. ఈ సందర్భంగా టీజీఓ వరంగల్ జిల్లా అధ్యక్షుడు మురళీధర్‌రెడ్డిని ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో అసోసియేషన్ వరంగల్ జిల్లా అధ్యక్షుడు దాసరి మురళీధర్‌రెడ్డి, అంజద్‌ఆలీ, హనుమకొండ కార్యదర్శి ప్రవీణ్‌కుమార్, ఫణికుమార్, ఈగ వెంకటేశ్వర్లు, నాగనారాయణ, కిరణ్‌కుమార్ గౌడ్, రాజేష్ కుమార్, కంచె వేణు పాల్గొన్నారు.

ప్రచారం కన్నా రహస్య మంతనాలు మిన్న

కాజీపేట: వరంగల్ పశ్చిమ నియోజకవర్గంలో పోటీలో ఉన్న ప్రధాన పార్టీల అభ్యర్థులు తమ వ్యూహాలకు పదును పెడుతున్నారు. డివిజన్ల వారీగా ఓటర్లను తమ వైపు తిప్పుకునేందుకు ఒకరిని మించి మరొకరు ఎత్తులకు పైఎత్తులు వేస్తున్నారు. ప్రధాన నాయకులు, కుల సంఘాల పెద్దలు, మహిళా సంఘాలు, యువజన సంఘాల సభ్యులను ప్రసన్నం చేసుకునేందుకు రహస్యమంతనాలు చేస్తున్నారు. విజయానికి అవరోధంగా ఏ అంశాలు ఉన్నాయి. వాటిని ఎలా అధిగమించాలనే ఆలోచనలతో ప్రత్యేకంగా పార్టీల్లోని ముఖ్య నాయకులకు బాధ్యతలను అప్పగించి ముందుకెళ్తున్నారు. కార్మిక, వృత్తిదారుల సంఘాలను తమవైపు తిప్పుకోవడంలో నిమగ్నమయ్యారు. ఇందుకోసం వారితో ప్రత్యేకంగా సమావేశమవుతున్నారు. అవతలి పక్షం నుంచి నేతలు, కార్యకర్తలను రప్పించేందుకు అభ్యర్థులు నానా తంటాలు పడుతున్నారు. అదేసమయంలో ఉన్న వారిని కాపాడుకునేందుకు తిప్పలు పడాల్సిన పరిస్థితి. సభ్యుల సంఖ్యను బట్టి తాయిలాలు అందజేస్తున్నారు. ఉదాహరణకు ఆటో డ్రైవర్లు, ప్రైవేట్ పాఠశాలల డ్రైవర్లు, భవన నిర్మాణ రంగ కార్మికులు ఇలా ఒక్కో వర్గం సంబంధిత సంఘాల్లో సభ్యులను గుర్తించి ప్రత్యేక ప్యాకేజీలను అందజేస్తున్నట్లు సమాచారం. మారిన రాజకీయ ట్రెండ్‌కు అనుగుణంగా వారికి కావాల్సిందే అప్పగిస్తున్నారని వినికిడి. నియోజకవర్గంలో రాజకీయ పార్టీల ప్రచారం కన్నా రహస్య మంతనాలే ఎక్కువగా కొనసాగుతున్నాయి.



రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు

జనగామ రూరల్ : రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలైన సంఘటన శనివారం వరంగల్–హైదరాబాద్ జాతీయ రహదారి పెంబర్తి యూటర్న్ వద్ద చోటుచేసుకుంది. మండలంలోని గోపిరాజుపల్లికి చెందిన రంగు బాలనర్సయ్య భార్య గౌరమ్మ ఇద్దరు జనగామ నుంచి పెంబర్తి వెళ్లి యూ టర్న్ మీదుగా బైక్‌పై వెళ్తుండగా హైదరాబాద్ నుంచి జనగామకు వస్తున్న లారీ యూ టర్న్‌పై వస్తున్న బైక్‌ను ఢీకొట్టడంతో ఇద్దరికి తీవ్రగాయాలు అయ్యాయి. గమనించిన స్థానికులు వెంటనే ఏరియా ఆసుపత్రికి తరలించి చికిత్స అందించారు. పరిస్థితి విషమంగా ఉండడంతో హైదరాబాద్‌కు తరలించారు. రోడ్డుపై పడిన లారీని ట్రాఫిక్ అంతరాయం లేకుండా ప్రొక్లెయిన్‌తో లారీని తొలగించారు. లారీ డ్రైవర్, క్లీనర్ ఇద్దరు పరారీలో ఉన్నట్లు పోలీసులు తెలిపారు.

ఓటమి భయంతోనే ఇందిరపై కడియం ఫిర్యాదు


విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న మారపాక రవి

స్టేషన్‌ఘన్‌పూర్: ప్రస్తుత ఎన్నికల్లో ఓటమి చెందుతాననే భయంతోనే బీఆర్ఎస్ అభ్యర్థి కడియం శ్రీహరి కాంగ్రెస్ అభ్యర్థి సింగపురం ఇందిరపై ఆర్‌ఓకు ఫిర్యాదు చేశారని కాంగ్రెస్ పార్టీ జిల్లా నాయకుడు, జెడ్పీటీసీ మారపాక రవి, కాంగ్రెస్ పార్టీ ఎస్సీ సెల్ రాష్ట్ర కన్వీనర్ చేపూరి చిరంజీవి అన్నారు. డివిజన్ కేంద్రంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. అపారమైన రాజకీయ అనుభవం ఉన్న కడియం శ్రీహరి ప్రస్తుత ఎన్నికల నేపథ్యంలో ఇందిరపై ఆర్‌ఓకు ఫిర్యాదు చేయడం విడ్డూరంగా ఉందన్నారు. మాదిగలంతా ఏకం కావాలని, నవంబర్ 30న చేతిగుర్తుకు ఓటు వేసి ఇందిరను గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో మాజీ జెడ్పీటీసీ గుర్రం యాదగిరి, నాయకులు నాగరబోయిన శ్రీరాములు, కత్తుల కట్టయ్య, నీల శ్రీధర్, ఐలపాక శ్రీను, మారపాక వసంత్, ఏలియా, సుమన్‌నాయక్, చింత జ్యోత్స్న తదితరులు పాల్గొన్నారు.

మద్యానికి బానిసైన వ్యక్తి మృతి

రఘునాథపల్లి: భార్య దూరంగా ఉంటుందన్న మనస్తాపంతో మద్యానికి బానిసైన ఓ వ్యక్తి మృతి చెందగా రెండు రోజులుగా ఇంట్లోనే ఉన్న మృతదేహం శనివారం వెలుగులోకి వచ్చిన సంఘటన మండలంలోని కంచనపల్లిలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. కంచనపల్లికి చెందిన కొడగాని మాధవరావు (37) ఆయన భార్య అనితకు మూడేళ్ల క్రితం గొడవలు జరిగాయి. అప్పటి నుంచి ఆమె ఇద్దరు పిల్లలతో కలిసి హనుమకొండలో నివాసం ఉంటోంది. భార్య తనతో ఉండటం లేదన్న బాధతో మద్యానికి బానిసై మాధవరావు అనారోగ్యలయ్యాడు. శనివారం మధ్యాహ్నం 3.30 గంటల సమయంలో ఇంట్లో నుంచి దుర్వాసన వస్తుండటంతో పక్కింటి వారు మృతుడి తండ్రి బాపురావుకు సమాచారం ఇచ్చారు. తండ్రి స్థానికులతో కలిసి కిటికిలో నుంచి ఇంటిలోపల చూశారు. మంచంపై అచేతనంగా పడి ఉండటం..దుర్వాసన వస్తుండంతో మరణించాడని భావించి పోలీసులకు సమాచారమిచ్చారు. 23న ఉదయం 9.30 గంటల సమయంలో గ్రామస్తుడు నవీన్‌తో మాట్లాడిన మాధవరావు తాను ఎన్నికల ప్రచారానికి రానని, ఇంట్లోనే ఉంటానని చెప్పి తలుపులు గడియవేసుకున్నాడు. అప్పటి నుంచి ఆయన బయటకు రాలేదు. ఈ నేపథ్యంలో 23నే మరణించి ఉంటాడని పోలీసులు భావిస్తున్నారు. మృతుడి తండ్రి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై రఘుపతి తెలిపారు.

ప్రచారానికి వెళ్లి వస్తూ..


వేణుగోపాల్(ఫైల్)

గీసుకొండ: వరంగల్ జిల్లా గీసుకొండ మండలంలోని మచ్చాపూర్ గ్రామానికి చెందిన మాజీ ఉప సర్పంచ్ దూలం వేణుగోపాల్(45) అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో కాంగ్రెస్ అభ్యర్థి కోసం గ్రామంలో ప్రచారం చేసి గురువారం రాత్రి ఇంటికి వెళ్తుండగా జరిగిన ప్రమాదంలో మృతి చెందినట్లు కుటుంబ సభ్యులు, బంధువులు తెలిపారు. గ్రామంలోని ప్రధాన రోడ్డుపై ద్విచక్రవాహనం నడుపుతూ ఇంటికి వెళ్తున్న క్రమంలో అకస్మాత్తుగా కుక్కలు అడ్డు రావడంతో కింద పడిపోయాడు. దీంతో తలకు బలమైన గాయాలై మెదడు దెబ్బతిందని, ఆస్పత్రిలో చేర్పించగా చికిత్స పొందుతూ శుక్రవారం అర్ధరాత్రి మృతి చెందినట్లు వారు పేర్కొన్నారు. కాగా, బాధిత కుటుంబాన్ని కాంగ్రెస్ పరకాల ఎమ్మెల్యే అభ్యర్థి రేవూరి ప్రకాశ్‌రెడ్డి తోపాటు బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు వీరగోని రాజ్‌కుమార్, సర్పంచ్ బోడకుంట్ల ప్రకాశ్ పరామర్శించారు. వేణుగోపాల్‌కు భార్య, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు గీసుకొండ పోలీసులు తెలిపారు.

గోదావరికి హారతి



కాళేశ్వరం: జయశంకర్ భూపాలపల్లి జిల్లా మహదేవపూర్ మండలం కాళేశ్వరంలోని శ్రీకాళేశ్వరముక్తీశ్వరస్వామి ఆలయంలో కార్తీమాసం పంచరత్నాల్లో భాగంగా వైకుంఠ చతుర్దశిని పురస్కరించుకొని గోదావరి నదికి పంచహారతి కార్యక్రమాన్ని ప్రధాన అర్చకుడు త్రిపురారి కృష్ణమూర్తిశర్మ ఆధ్వర్యంలో శనివారం నిర్వహించారు. గోదావరికి పాలు, పండ్లు, పసుపు, కుంకుమతో పాటు సారెను సమర్పించారు. కార్యక్రమంలో సూపరింటెండెంట్ శ్రీనివాస్, ధర్మకర్తలు అడప సమ్మయ్య, కామిడి రాంరెడ్డి, అర్చకులు ప్రశాంత్‌శర్మ, బైకుంఠపాండా, సుబ్రమణ్యశర్మ, రాజరాజేశ్వర సేవా సమితి సభ్యులు పాల్గొన్నారు.